

ఎండ తీవ్రంగా వుంది. కిటికీ లోంచి వేడి గాడ్పు వీచి, కళ్ళు మండుతున్నాయి. పక్క, దుప్పటీ, దిండూ—అన్నీ శరీరానికి వేడిగా తగులుతున్నాయి. నోరు తడి ఆరిపో తున్నది. మీనాక్షి పక్కమీద ఒత్తిగిలి, బల్లమీద కూజాలోంచి కాచిన నీళ్ళు చల్లనివి ముఖంమీద జల్లుకుంది.

"నో! నో! అలాటి పనులే చెయ్యొద్దని మీ కెన్నోసార్లు చెప్పాను" అంటూ నర్సు గబగబ వచ్చింది.

"ధైర్యంగా వుండాలి. అలా ఏడుస్తూ పడు కుంటే కళ్ళు పాడవుతాయి, ఒళ్లూ పాడవుతుంది." నర్సు తన మామూలు ధోరణిలో చెప్పుకు పోతోంది.

మీనాక్షి ఆమె వంక చూడటం లేదు. ఆమె దృష్టి అంతా కిటికీబైట వరండాలో వుంది. నర్సు ఇంకా ఏదో గొణుగుతోంది. మీనాక్షి ఓ క్షణం ఆమెవైపు తిరిగింది. ఆ రూపం మీనా క్షికి ఏదో జుగుప్స కలిగిస్తోంది. ఆ గొంతు, ఆ ముఖం—చాలా సంవత్సరాలుగా చూస్తున్నట్లు వుంది. ఇంతలో తలుపు చప్పుడయింది, గోపాలం నెమ్మదిగా లోపలికి ప్రవేశించాడు. అతని చేతిలో భోజనం క్యారియరు చూసి, నర్సు బైటికి వెళ్ళిపోయింది.

"ఎలా వున్నావు?" అంటూ కుర్చీ లాక్కుని, మీనాక్షికి ఎదురుగా కూర్చున్నాడు అతను.

రోజూ ఆ ప్రాంతాల నర్సింగ్‌హోము నిశ్శబ్దంగా వుంటుంది. రోగుల సంఖ్యకూడా చాలా తక్కువ కావటంవల్ల, మధ్యాహ్న మయ్యేసరికి చీమ చిటుక్కుమన్న శబ్దంకూడా వుండదు. ఈ




సమయానికే మీనాక్షికి గుబులు, ఆందోళన ఎక్కువయేవి. నిద్రపట్టేదికాదు. తల భారంగా. అలసటగా, మంచంమీద అటూ ఇటూ దొర్లుతుండేది. పోనీ, ఈ మధ్యాహ్నం త్వరగా ముగిసిపోయి సాయంకాలం కోసరం ఎదురు చూద్దామా అంటే, ఆ ఆశాలేదు. సాయంత్రాలంటే మీనాక్షికి ఇప్పుడు భయం మునుపులా, చల్లగాలితోబాటు చల్లదనంలేదు.ఆ సాయంత్రపు వేళలో తనని చూడటానికి వచ్చేవాళ్ళంతా ఎంతో నిర్దయులుగా, అపరిచితుల్లా వుంటారు. వాళ్ళ పరామర్శలు, సానుభూతి వచనాలు ఏవో మనసుకి దూరంగా. అతి వెలితిగా ధ్వనిస్తాయి. అందుకనే, ఆ సాయంత్రం మోసుకువచ్చే రాత్రి కూడా మీనాక్షికి అశాంతిగా,చిరాకుగా వుంటుంది.

"ఏమిటాలోచిస్తున్నావ్ ? "గోపాలం, ముందుకి ఒంగి యథాలాపంగా అడిగాడు.

ఏం లేదన్నట్లు పెదిమ విరిచింది మీనాక్షి, కానీ కళ్లల్లో గిర్రున నీళ్లు తిరిగాయి. "నేను ఇంకా ఉన్నానుగా ? ఎందుకలా దిగులుపడతారు: "గోపాలం మాటల్లో ఓదార్పుకంటే విసుగుదల ఎక్కువ స్ఫురిస్తోంది. మీనాక్షి కళ్లు తుడుచుకుని, లేవబోయింది. అతను చెయ్యి అందిస్తుంటే, దిండు మీదగా ఆనుకుని కూర్చుంది. "మీతో ఓ ముఖ్య విషయం చెప్పాలి." మీనాక్షి గొంతు సవరించుకుంది. గోపాలం ముఖంలో ఆతురత లేదు. కాస్త సంకోచపడుతున్నట్లు భార్యవంక చూశాడు.

"అసలు మీరు వుండగానే ఈ ప్రస్తావన వచ్చివుంటే బాగుండేది. పిల్లవాడికి యింకా వారం కూడా లేదుట. బ్రాహ్మలు"... "మీనా: వెంటనే ఇప్పుడెందుకీ వ్యర్థపు మాటలు ? నువ్వు ముందు కోలుకో, ఇలాంటివి ఆలోచించేందుకు బోలెడంత వ్యవధి వుంది. అయినా, మన దేశంలో పిల్లలకేంకరువులేదు, ఏక్షణాన్నయినా. ఎక్కణ్ణించయినా తెచ్చి పెంచుకోవచ్చు. నాకు ప్రస్తుతం కావలసింది నీ ఆరోగ్యం."

గోపాలం పొడిగా ఈ మాటలని లేచి నిలబడ్డాడు. భార్యవైపు చూడకుండానే, పళ్లెం, క్యారియరు ఆమెముందు వుంచాడు.

మీనాక్షి కళ్లు వ్పగించి, అతని కేసిచూస్తోంది.

మీనాక్షికి పెళ్లయి ఇప్పటికి పది సంవత్సరాలు దాటుతోంది, పిల్లల్నిగురించి కలలు కనటం, తన ఆరోగ్యం కాపాడుకోవటం, చిన్న చొక్కాలూ, టోపీలు కుట్టటం ... ఇంతటితోనే ఆమె అనుభవాలు ఆగిపోయాయి, ఆ కలల పంట, పాపాయిని ఎత్తుకుని, పొత్తిళ్లల్లో దాచుకొని, చిన్నారి ముఖంచూసే అదృష్టానికి ఆమె నోచుకోలేదు. భగవంతుడు విధిస్తున్న ఈ శిక్షకి భార్యాభర్త లిద్దరూ కుమిలిపోయేవారు.

కానీ గోపాలం వేరు, ఆఫీసు కాయితాల్లో, స్నేహితుల సాహచర్యంలో, క్లబ్బుల మత్తులో— అతను ఈ దిగులుకి అంత ప్రాముఖ్యం యివ్వకుండా తప్పించుకొంటున్నాడు. కానీ మీనాక్షి వేరు. ఆమెకి చదువులేదు. అంతగడుసరి కాదు ఆమె ప్రపంచం వంటయింటి గిన్నెలకీ, అత్తమామల సేవకీపరిమితం అయివుంది. ఆ చిన్న ప్రపంచం మీనాక్షికి పిల్లలు లేని కొరతని ఎక్కువచేసేది కానీ, మరిపించేది కాదు.

* * *

అందుకే మీనాక్షి బాధగా భర్తని అర్థం చేసుకోలేక అలా చూస్తోంది. భర్త తనతో ఈ విధంగా తుంచినట్లు మాట్లాడటం యిది మొదటిసారి కాదు. తను ఇలాటి ప్రస్తావన తెచ్చినప్పుడల్లామనసు గాయపరుస్తూనే వున్నాడు. వాస్తవానికి తన బాధ డాక్టరు తులసి అర్థంచేసుకున్నట్లు మరెవరూ అర్థంచేసుకోలేదు. ఆ వేళ ఉదయం డాక్టరు మాటలు యింకా ఆమె చెవుల్లో మారుమ్రోగుతున్నాయి.

* * *

"పిల్లలు లేరో అని అలా కుమిలిపోకపోతే పెంచుకోకూడదూ ?"

ఉలిక్కిపడినట్లు మీనాక్షి కళ్ళు తెరిచింది. తలదగ్గిరగా నిలబడి వుంది ఆమె. తెల్లచీర రవిక. బాగా నెరిసిన జుత్తు చేతిలో స్టెతస్కోపు. బక్కగా, పొట్టిగా వుంది. మీనాక్షి కళ్ళల్లో కళ్ళు పెట్టి చూస్తోంది.

## ఆపాపని నాకు ఇచ్చేయండి

"మీ రెవరు ?" అనడిగింది నెమ్మదిగా, ఇదివరకెన్నడూ ఆమెని చూసిన గుర్తు లేక.

"డాక్టరు రాధ అక్కని పేరు తులసి నేనూ డాక్టర్నే !"

ఆమె ఆప్యాయంగా మీనాక్షి తల మీద చెయ్యివేసింది. లేవబోతున్న ఆమెని ఒద్దని వారిస్తూ చెయ్యి వూపింది.

"సాధారణంగా వైద్య వృత్తిలో నున్న మేము ఈ విషయాలు పైకి పొక్కనివ్వకూడదు కానీ ఇప్పుడు పరిస్థితి అలా వచ్చింది కనుక చెబుతున్నాను."

డాక్టర్ తులసి కళ్ళు చిట్లించి, కిటికీవైపు చూసింది. పెద్ద అంగలతో అటువెళ్ళి తెరలు సరిగ్గా లాగింది అంత తొందరగానూ తలుపు వైపు నడిచి, అటూ యిటూ చూసి, నెమ్మదిగా తలుపువేసి, గడియ పెట్టింది.

మీనాక్షికి ఏదో నలతగావుంది. ఈ ఆకస్మిక అతిధి పంక తెల్లబోయి చూస్తూ, కళ్ళు నులుముకుంది.

"నేను ఇప్పుడు చెప్పబోయే విషయం బహుశః నీకు రుచించదు. కానీ నిజం నిప్పులాటిది ఏనకతప్పదు."

డాక్టరు తులసిగదిలో పచార్లుచేయటం ప్రారంభించింది. ఆమె నడుస్తుంటే, వెనుకనుంచి చూసేవారెవరైనా, ఆమెని ఒక డాక్టరుగా పోల్చుకోలేరు. చేతిలో స్టెతస్కోపు మినహా, అతి సాధారణంగా, పీలగావుంది మనిషి కానీ కళ్ళల్లో విపరీతమైన ఆకర్షణ, కాంతి వున్నాయి. జీవితానుభవం నేర్పిన ఎన్నో సత్యాలు ఆమె ఆ కళ్ళల్లోనే దాచుకుందా అన్నట్లున్నాయి. ఆ చూపులు.



ఫిబ్రవరి 21న మదరాసులో కచేరీ చేసిన ప్రసిద అమెరికన్ బాక్ పియానిస్ట్ రొజాలిన్ ట్యూరెక్

"మంచి వంశంలో పుట్టావు. అంతో, ఇంతో చదువు సంస్కారాలున్నాయి. తీరని కోరికలతో ఇలా తపనపడకపోతే, అవి తీరే దారులు వాస్తవికంగా ఎందు కాలోచించవు? ఇప్పటికి ఎన్నోకాన్పు ఇలా పోవటం?"

మీనాక్షి దిండులో ముఖం దాచుకుని బావురుమంది.

"ఉష్! ఏడవకమ్మా!"

ఆమె మీనాక్షి బుజాలుపట్టుకుని మృదువుగా నొక్కింది.

"ఎందుకు చెప్తున్నానంటే, డాక్టర్ని అయివుండీ నీకు లేనిపోని ఆశలు కల్పించటం నాకు యిష్టంలేదు నా సలహా అడిగితే. వెంటనే పాపని పెంచుకో. ఆ విధంగా నీ దుఃఖమూ మరిచిపోగలుగుతావు. ఒక ప్రాణికి సహాయం చేసినట్లూ వుంటుంది."

"అదెలాగ?" మీనాక్షిగొంతు గాద్గదికమయింది.

"చెప్పనా?" ఆమె మీనాక్షికి ఎదురుగావచ్చి నిలబడింది. చేతులు బిగించి, ఓరగా తలుపువైపు చూసింది.

"ఇప్పుడే. ఇక్కడే నర్సింగుహోములో ఒక పండంటి పిల్లాడు పుట్టాడు తల్లి కనేసిన వెంటనే వెళ్ళిపోయింది. పేరూ, వూరూ నన్ను అడక్కు. అదంతా రహస్యం! కానీ పిల్లాడు మంచి వంశంలోనివాడు. నేను హామీ యిస్తున్నాను, నన్ను నమ్ము."

ఆమె మీనాక్షి చేతిని తన చేతిలో వేసుకుంది. వెంటనే గిరుక్కున ముఖం తిప్పేసుకుంది. కళ్ళల్లో కొద్దిగా నీళ్ళు తిరిగాయా అనిపించింది మీనాక్షికి.

"అదంతా ఒక విచిత్రమైన కథ. నమ్మశక్యం కానిది. వాళ్ళిద్దరూ ప్రేమించుకున్నారు. పాప ఫలమో, పుణ్య ఫలమో ఈ పిల్లాడు పుట్టాడు. ఆమె తల్లి కాబోతోందని తెలిసి కూడా, ఇరువైపుల కుటుంబాలలోని పెద్దలూ వివాహానికి ఒప్పుకోలేదు. పై పెచ్చు, పసివాణ్ణి ఇలా నా దగ్గిర వదిలేసేందుకు ఒప్పందం చేసుకున్నారు. డబ్బమ్మా! డబ్బు! దానిపేర్న ఏమయినా జరుగుతుంది. ఎన్ని పెళ్ళిళ్ళు అయినా జరిగిపోతాయి."

"పాపని ఒదిలేసేందుకు ఆ తల్లి ఎలా ఒప్పుకుంది ?" మీనాక్షికి చాలా అసహ్యంగా, ఎబ్బెట్టుగా వుంది ఇదంతా.

"ఏం చేస్తుంది ? కులభేదం అంటూ తల్లి తండ్రులు వివాహం చెయ్యనన్నారు. ప్రేమించిన నాథుడు నిరాశతో విదేశం పారిపోయేడు శుభ్రంగా రేపు పందిట్లో కూర్చుని నలుగురూ చూసే పెళ్ళి వేరే చేసుకుంటుంది."

"అబ్బ!" సహించలేనట్లు మీనాక్షి చెవులు మూసుకుంది.

"అదిగో! అదే మీతో వచ్చిన చిక్కు. ఆ తల్లిదండ్రుల్ని తల్చుకుని చీదరించుకుంటారేం? ఇప్పుడు మనం ఆలోచించవలసింది ఆ పసిగుడ్డు విషయం."

ఆమె మీనాక్షి దగ్గిరగా వచ్చింది. రహస్యం చెబుతున్నట్లు ఒంగింది.

"ఆ పిల్లవాణ్ణి నా రక్షణకింద అష్టకాలం వుంచుకోరాదు. వెంటనే అనాధ శరణాలయానికి కబురుచేసి, ఒప్పచెప్పెయ్యాలి. అది నా వృత్తి ధర్మం. తిన్నగా నాదగ్గిర్నుంచే పిల్లవాణ్ణి నీకు

సుప్రసిద్ధ నవలా రచయిత్రి

శ్రీమతి చెరుకూరి రమాదేవి

క్రొత్త సీరియల్

"మరుపులో మెరుపులు"

9-4-1971 సంచిక నుంచి

ప్రారంభం!

ఎడిటర్ ఆంధ్రజ్యోతి సచిత్ర వార పత్రిక

యివ్వలేను. కానీ ఒప్పుకుంటే,తగిన ఏర్పాట్లన్నీ వెంటనే చేయిస్తాను."

మీనాక్షిగుండె దడ దడ కొట్టుకుంటోంది. ఆశ, భయం, ఆందోళన_ఒకదానివెంట ఒకటి తరుముకుంటూ ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి.

"నా భర్తని అడగాలి" అంది చివరికి.

"కొందరపడు. నీలాటి స్త్రీలు చేసే ఆలస్యం వల్లే దిక్కు_లేని పిల్లలు మట్టిపాలవుతున్నారు. అలా చూడకు! నా మాట విను. ఈ శరణాలయాల్లో, శిశుమందిరాల్లో చేరే పసివాళ్ళకి కావలసినవి. ఉయ్యాలలూ, బొమ్మలూ, పాలడబ్బాలూ కాదు. అమ్మ! అమ్మ కావాలి!"

ఆమె మళ్ళీ వచార్లు చేయటం ప్రారంభించింది, "తల్లి ప్రేమ, రక్షణ, ఆదరణ లేనిదే వాళ్ళు బ్రతకలేరు. పెద్ద భవనాలూ, ఆయాలూ, డాక్టర్లూ వాళ్ళని బ్రతికించలేవు. ఒక స్త్రీ తన మాతృప్రేమతో పాపకి ఆరోగ్యం. ఆయుష్షు, ఆనందం— అన్నీ యివ్వగలదు. ఆ సహజ ప్రేమ, వాత్సల్యం కొరవడి, ఆరునెలలు తిరగక ముందే పిల్లలు చనిపోతున్నారు. నా మాట విను. ఈ పసివాణ్ణి అలా పోనివ్వక........."

మీనాక్షి బాధగా కళ్ళు మూసుకుంది. డాక్టర్ తలని హఠాత్తుగా తలుపు తెరిచి, వెళ్ళిపోయింది.

• • •

ఉదయం జరిగిన ఈ యావత్తూ భర్తకి చెప్పలేక, మనసులో దాచుకోలేక, అతను వెళ్ళిపోతుంటే, నిస్పృహతో చూస్తూ వూరుకుంది మీనాక్షి.

+ + +

ఆరోజు మిగతారోజుల్లా అతి దీర్ఘంగా, పేలవంగా,బాధగా సాగిపోతుంది.కానీ ఆ రాత్రి మీనాక్షికి చాలాసేపు కన్నుమూత పడలేదు. కలత నిద్రలో అనేక దృశ్యాలు కనుపించాయి. ఒక చోట అనేక శిశువుల కళేబరాలు కుప్పగాపోసి వున్నాయి. మరోచోట పందిట్లో బాజాభజంత్రీలు మ్రోగుతున్నాయి. పెళ్ళికూతుర్ని అలంకరిస్తున్నారు. ఆ ముఖం ఎక్కడో చూసిన గుర్తు... ఉయ్యాలలో ఆరునెలల పసికందు చిక్కి_శల్యమై పడుకుని వున్నాడు...డాక్టర్లూ, నర్సులూ, ఆయాలూ హడావుడిగా తిరుగుతున్నారు. పిల్లలు ఏరి? అని ఒకర్ని ఒకరు అడుగుతున్నారు. పిల్లల ఏడుపుతో మారు మ్రోగుతోంది ఆ గది. కానీ అక్కడ వున్నవి చెక్క_ముక్క_లూ, బొమ్మలూ, పాలడబ్బాలూ...ఇంతలో గుడ్డలో చుట్టిన ఒక పాపని తీసుకువచ్చింది ఆయా. భయంకరంగా వుంది ఆయా ముఖం. గుడ్డతీసి చూస్తే వికృతమైన పాప కళేబరం. కెవ్వుమని అరుస్తూ లేచింది మీనాక్షి. ఇద్దరు నర్సులు ఆమెను చెరోపక్కా పట్టుకున్నారు.

"ఏమయింది?" అ డి గా రు ఆతురతతో. మీనాక్షి గట్టిగా ఏడుస్తూంది.

"నాకు ఆ పాపని ఇచ్చేయండి. పెంచుకుంటాను. డాక్టర్ తలనికి చెప్పండి. మరెక్కడికి పంపవద్దు" ఉద్రేకంగా అరుస్తూంది మీనాక్షి.

తెల్లగా తెల్లవారిపోయి వుంది. గదిలో బాగా వెలుగు పడుతుంది. అప్పుడే మీనాక్షి కోసం ఫ్లాస్కు_లో కాఫీ పట్టుకువచ్చిన గోపాలం, తెల్లబోయి, గుమ్మం దగ్గిరే నిలబడిపోయి, యిదంతా చూస్తున్నాడు.

ఇంతలో ఒక నర్సు పరుగెత్తుకు వెళ్ళి డాక్టర్ రాధని పిలుచుకు వచ్చింది. ఆమె ఆత్రుతతో రోగిని చేరుకుంది.

"ఏమిటమ్మా! ఇదంతా?" అంటూ చెయ్యి పట్టుకుంది. "డాక్టర్! ఆ పిల్లవాణ్ణి నేను పెంచుకుంటాను. మీ అక్క_ డాక్టర్ తలనికి చెప్పండి "లేకపోతే ఆపసివాడు చనిపోతాడు." మీనాక్షి డాక్టర్ రాధ మెడని వాటేసుకుని, ప్రాధేయపడుతుంది.

ఒక క్షణం డాక్టర్ రాధ కనుబొమలు ముడిపడ్డాయి. వెంటనే ఆమె నర్సుకి కంటితో సంజ్ఞ చేసింది.

"అలాగే నమ్మా! ఇప్పుడే తీసుకువస్తాను" అంటూ బైటికి నడిచింది.

"పిచ్చి సన్యాసి, ఎంతజాగ్రత్త తీసుకున్నా, లోపల జొరబడి గదులన్నీ కలియతిరుగుతుంది. దాని పిచ్చికాదు కానీ, రోగులకి పిచ్చెక్కి_ంచేస్తుంది." గట్టిగానే విసుక్కుంటోంది డాక్టర్.

"ఏమయింది? డాక్టర్!" గోపాలం ఆమెని అనుసరించాడు.

ఓ! నథింగ్! ఆమె ఒక మెంటల్ కేస్. చాలాఏళ్ళ కిందట ఇక్కడ నర్సింగ్ హోమ్‌లో వుంది. అదొక ట్రాజిడీ! వైద్యవృత్తిలో వున్న మాకు ఇలాటివి క్రొత్తకాదు."

అంటూ డాక్టర్ రాధ చకచక వెళ్ళిపోతోంది. దూరంగా మీనాక్షి అరుపులు ఇంకా వినిపిస్తున్నాయి. ...

"ఆ పాపని నాకు ఇచ్చేయండి." ●

## గాథావళి-278

# గొప్ప వీరుడు

కొన్ని సందర్భాలలో మన అదృష్టం బాగుంటే ఏ చెడుపని చేసినా ఘనంగా పేరువస్తుంది. ఉదాహరణకు కొరియా యుద్ధంలో ఒకతను యుద్ధంలోవి సైనికులకు మందుగుండు సామాను సరఫరా చేయడానికి నియమించబడ్డాడు ఒకసారి శత్రుసేనలమధ్య తన లారీతో ఉన్నాడు కాల్పులు జరుగుతున్నాయి ప్రమాదం జరుగుతుందని వెంటనే లారీ క్రింద దూరాడు వెంటనే గుర్తు కొచ్చింది లారీలోదికూడా మందుసామానే కాబట్టి ఇంకా ప్రమాదమని ధైర్యం చేసి లారీనడుపుకొంటూ గమ్యం చేరాడు. ఇదంతా చూసిన అధికారులు అతన్ని ఈ విధంగా అభినందించారట

"ఇతను గొప్ప వీరుడు భయంకర శత్రుకాల్పుల మధ్య నుండి కూడా లారీ చెడిపోతే దిగి రిపేరుచేసుకొని వీరోచితంగా గమ్యం చేరాడు."

తంగెళ్ళపల్లి సుధాకర్, భువనగిరి

ఆటోమేటిక్ 50 షాట్లు
జర్మన్ మోడల్ రివాల్వర్



లైసెన్సు అవసరం లేదు. ఈ ఆటోమేటిక్ 50 షాట్ల పిస్టలు మీకు రక్షణగా వుంటుంది. దొంగలు, క్రూర జంతువుల బారినుండి రక్షించుకోవచ్చును. పిక్నిక్, ప్రయాణం, డ్రామాలలో ఉపయోగపడును. ఆటోమేటిక్, పెద్దమోత. విప్పవచ్చును. రు. 25/- వి.పి.పి. ఛార్జీలు రు.3-50. 100షాట్లు ఉచితం.అదనంగా 100 షాట్లు రు.3/- లెదరుకేసు రు5/-

PARKER AGENCIES (WAJ-25p)
Post Box No. 1279, DELHI-6